క్లుప్తంగా

వైభవంగా అమావాస్య పూజలు



భద్రకాళమ్మ ఆలయంలో అమ్మవారికి ఊంజల్‌సేవ నిర్వహిస్తున్న దృశ్యం

గుడిపాల: నరహరిపేట చెక్‌పోస్ట్ సమీపంలో ఉన్న భద్రకాళమ్మ ఆలయంలో శనివారం అమావాస్య పూజలను వైభవంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి అభిషేకం నిర్వహించి విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేపట్టారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. సాయంత్రం అమ్మవారికి ఊంజల్‌సేవ నిర్వహించారు. వచ్చిన భక్తులందరికీ అన్నదానం చేశారు.

రేపు కంటి వైద్య శిబిరం

తవణంపల్లె: మండల కేంద్రంలోని జీసెస్ గాస్పెల్ చర్చిలో సోమవారం ఉదయం చెన్నై ఎం.ఎన్. కంటి ఆస్పత్రి సౌజన్యంతో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు పాస్టర్, జీసెస్ గాస్పెల్ ప్రేయర్ మినిస్ట్రి ట్రస్టు ప్రెసిడెంట్ టి.ఏసు తెలిపారు. కంటి వైద్య నిపుణులచే రోగులకు పరీక్షలు నిర్వహించి దృష్టి లోపం ఉన్న వారికి ఉచితంగా ఆపరేషన్ చేయిస్తామన్నారు.

చందనాలంకారంలో ముత్యాలమ్మ



బంగారుపాళెం: దేవీశరన్నవ రాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి స్థానిక గ్రామ దేవత ముత్యాలమ్మ చందనాలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవాలలో భాగంగా తొలిరోజు ఉదయం అమ్మవారి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం అమ్మవారిని చందనంతో అలంకరించి దర్శనం కల్పించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు అందుకున్నారు. గ్రామంలోని ఓంశక్తి ఆలయం, ఓటీకే వీధిలో సత్యమ్మ ఆలయం, మొగిలివెంకటగిరిలోని గంగమ్మ ఆలయాల్లో దేవీనవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవార్లకు విశేష పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



దుర్గాంబ దేవస్థానం వద్ద ఏర్పాటు చేసిన మండపం



రంగురంగుల విద్యుత్ దీపాలంకరణ



నగరంలో ఏర్పాటు చేసిన చలువ పందిరి



విద్యుద్దీపాలతో దుర్గాదేవి కటౌట్

నేడు దసరా సంబరం ఆరంభం

- శరన్నవరాత్రి ఉత్సవాలకు సర్వం సిద్ధం
- వివిధ రూపాల్లో అభయమివ్వనున్న దుర్గామాత

చిత్తూరు రూరల్: దసరా ఉత్సవాలకు శ్రీ దుర్గాంబ దేవస్థానం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. ఆదివారం నుంచి వేడుకలు ప్రారంభం కానున్నాయి. ఇప్పటికే నగరంలోని వీధుల్లో రంగురంగుల విద్యుద్దీపాలంకరణలతో తీర్చిదిద్దారు. వివిధ రూపాల్లో అమ్మవారు భక్తులకు దర్శనమివ్వనున్నారు. నవరాత్రి ఉత్సవాలను చిత్తూరు నగరం గిరింపేటలోని శ్రీ దుర్గాంబ దేవస్థానంలో అత్యంత వైభంగా నిర్వహించనున్నారు. 11 రోజుల పాటు జరిగే ఈ ఉత్సవానికి పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. పదిరోజులకు ముందు నుంచే పనులను మొదలుపెట్టారు. ఆలయ ఆవరణలో భారీ విద్యుత్ కటౌట్ కట్టారు. అమ్మవారిని కొలువుదీర్చేందుకు భారీ స్థాయిలో చలువ పందిరి వేశారు. భక్తులు అక్కడ ఇబ్బందులు కలగకుండా క్యూలను ఏర్పాటు చేశారు. ఆలయం, పందిరి చుట్టూ అరటి, మామిడి, వేపాకు తోరణాలు కట్టారు. ఉదయం ప్రారంభోత్సవ పూజలకు ముహూర్తం ఖరారు చేశారు.

పూజా కార్యక్రమాలు

నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రతిరోజు ఉదయం అభిషేక పూజలు జరుగుతాయి. ఆదివారం ఉదయం 5 గంటలకు మహాచండీ హోమం, మూలస్థానంలోని దుర్గాంబకు 108 బిందెలతో పాలాభిషేకం, 9 గంటలకు అభిషేకం, 10008 బిందెలతో పవిత్ర మహా జలాభిషేకం భక్తిశ్రద్ధలతో జరిపించనున్నారు. రాత్రి బహురూపాల్లో అమ్మవారు భక్తులకు దర్శనమివ్వనున్నారు.

నవరాత్రులు

దసరా బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆదివారం రాత్రి 7 గంటలకు మహాదేవి అలంకారంలో సాక్షాత్కరించనున్నారు. అలాగే ఈనెల 16న చాముండేశ్వరిదేవి అలంకారం, 17న శ్రీలలితాదేవి అలంకారం, 18న శ్రీపార్వతీదేవి, 19న శ్రీకాత్యాయని దేవి, 20న సరస్వతిదేవి, 21న మహిషాసుర మర్ధిని, 22న రాజరాజేశ్వరీదేవిగా భక్తులకు దర్శనమివ్వనున్నారు. 23న దుర్గాదేవి పవళింపు సేవ, 24న పుష్పరథం, గ్రామోత్సవం, 25న వసంతోత్సవం కనులపండువగా నిర్వహించనున్నట్లు ఈఓ మునిశేఖర్ తెలిపారు.

నగరంలోని మందిరాల్లో..

దుర్గాంబ దేవస్థానంతో పాటు శ్రీవీరాంజనేయస్వామి ఆలయం, పొన్నియమ్మ ఆలయం, ముత్యాలమ్మ ఆలయం, కరుమారియమ్మ ఆలయం, శ్రీచౌడేశ్వరమ్మ ఆలయం, సాయిబాబా మందిరం తదితర ఆలయాల్లో కూడా నేటి నుంచి నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఇందుకు కావాల్సిన అన్ని ఏర్పాట్లను శరవేగంగా పూర్తి చేశారు. రాత్రి వేళ ఆయా ఆలయాల్లోని దేవతామూర్తులు పలు అలంకారంలో భక్తులను కనువిందు చేయనున్నారు. భక్తుల రద్దీ దృష్ట్యా ముందస్తుగా ఏర్పాట్లు చేశారు.

ఏర్పాట్లు ముమ్మరం

ఆలయశుద్ధి నుంచి బ్రహ్మోత్సవం ముగిసేంత వరకు కావాల్సిన ఏర్పాట్లకు ముందస్తు ఆర్డర్లు ఇచ్చారు. ప్రధానంగా విద్యుత్ దీపాలు, చలువ పందిరి, ప్రసాదం తయారీ, అమ్మవారి అలంకరణ, వాయిద్యాలు, పూలమాల సరఫరాకు ముందస్తుగానే కొటేషన్లు ఆహ్వానించి బాధ్యతలు అప్పగించారు. గతేడాది కంటే ఈ సారి నిర్వహణ భారీగా పెరిగింది. నిర్వహణదారులకు డిమాండ్ ఎక్కువ ఉంది. అయితే వారివారి పనుల్లో బిజీబిజీగా కనిపిస్తున్నారు. పలువురికి జీవనోపాధి లభించింది. పువ్వుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ఆలయ పెద్దలు ప్రజాప్రతినిధులు, ప్రముఖులకు ఆహ్వాన పత్రికలు అందించే ప్రక్రియ పూర్తయింది.

కక్షిదారులపై అదనపు భారం అన్యాయం



చిత్తూరులో సమావేశమైన ఉమ్మడి జిల్లా న్యాయవాదుల సంఘం నాయకులు

చిత్తూరు అర్బన్: కక్షిదారులు న్యాయస్థానాల్లో దాఖలుచేసే పిటిషన్లపై రూ.20 స్టాంపులను విధిగా అతికించాలని రాష్ట్ర బార్ కౌన్సిల్ తీసుకున్న నిర్ణయం అన్యాయమని ఉమ్మడి చిత్తూరు జిల్లా న్యాయవాదుల సంఘాల సమాఖ్య డిమాండ్ చేసింది. చిత్తూరులోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో శనివారం తిరుపతి, చిత్తూరు, మదనపల్లెతో పాటు ఉమ్మడి జిల్లాలోని బార్ అసోసియేషన్ నాయకులు సమావేశమయ్యారు. జిల్లా సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులుగా చిత్తూరు బార్ నాయకులు రాజేంద్రరెడ్డి, అశోక్ ఆనంద్ యాదవ్‌ను ఎన్నుకున్నారు. అనంతరం నేతలు మాట్లాడుతూ ఇప్పటి వరకు పిటిషన్లపై అతికిస్తున్న రూ.1 స్టాంపును యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. న్యాయవాదులు చనిపోతే అందుతున్న రూ.4 లక్షల ఆర్థికసాయాన్ని, రూ.10 లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు.

అంకాళపరమేశ్వరి ఆలయంలో ఆరంభం



అమావాస్య అలంకరణలో, ఊంజల్ సేవకు సిద్ధమైన అంకాళపరమేశ్వరి

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరం గుర్రప్పనాయుడువీధిలోని శ్రీ అంకాళపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో శనివారం శరన్నవరాత్రులు ప్రారంభమయ్యాయి. ఉదయం మూలస్థానంలోని అమ్మవారికి అభిషేక పూజలు చేశారు. తర్వాత అమావాస్య అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి ఉయ్యాల సేవలో కనువిందు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో చైర్మన్ కేఎం కుమార్, అర్చకులు కుమార్ పాల్గొన్నారు.

జ్వరపీడితులకు వెంటనే వైద్యం చేయించాలి



పైమాఘంలో జిల్లా మలేరియా అధికారి పీరూసాహెబ్, వైద్యాధికారి మోహన్‌వేలు

తవణంపల్లె: గ్రామాల్లో జ్వరం సోకిన వారికి వెంటనే వైద్యం అందించాలని జిల్లా మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ పీరూసాహెబ్ వైద్య సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని పైమాఘం గ్రామంలో శనివారం జ్వరపీడితులను పరిశీలించారు. ఇంటింటికీ తిరిగి జ్వరంతో బాధపడుతున్న వారిని గుర్తించి రక్తనమూనాలు సేకరించారు. కార్యక్రమంలో వైద్యాధికారి మోహన్‌వేలు, సర్పంచ్ మల్లుదొరై, పంచాయతీ కార్యదర్శులు చైతన్య, మహేష్, హెల్త్ సూపర్‌వైజర్ రాజశేఖర్, హెల్త్ అసిస్టెంట్లు మనోహర్, సుబ్రమణ్యం రెడ్డి, ఎంఎల్‌హెచ్‌పీ హైమావతి, ఏఎన్‌ఎంలు భార్గవి, రోజా, ఆశావర్కర్ పార్వతి, పంచాయతీ సచివాలయ కన్వీనర్ ప్రశాంత్‌కుమార్, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం



విరాళాన్ని అందిస్తున్న దాత కుటుంబ సభ్యులు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి నిత్యాన్నదానానికి తిరుపతికి చెందిన శర్వాని కుటుంబ సభ్యులు రూ.లక్ష విరాళాన్ని ఆలయ అధికారులకు అందించారు. మధ్యాహ్నం దాత కుటుంబ సభ్యులు స్వామివారి దర్శనార్థం కాణిపాకం విచ్చేశారు. అనంతరం నిత్యాన్నదానం కోసం రూ.లక్ష విరాళాన్ని ఆలయ ఇన్‌స్పెక్టర్ సురేష్‌కు అందించారు. దాత కుటుంబ సభ్యులకు స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారలు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణాను అరికట్టాలి



మాట్లాడుతున్న బుజ్జిరెడ్డి

ఐరాల: మానవ అక్రమ రవాణా ప్రపంచంలోనే అతిపెద్ద నేరమని, దానిని అరికట్టాల్సిన బాధ్యత మనందరిపై ఉందని పార్టీ మండల అధ్యక్షుడు బుజ్జిరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని వారపు సంత వద్ద శనివారం రీడ్స్ సంస్థ ఆధ్వర్యంలో మహిళలు, ఆదీవాసీలకు మానవ అక్రమ రవాణాపై వాక్ ఫర్ ఫ్రీడమ్ కార్యక్రమం నిర్వహించారు. బుజ్జిరెడ్డి మాట్లాడుతూ మహిళల అక్రమ రవాణాపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని తెలిపారు. ఆర్థిక ఇబ్బందులు, నిరక్షరాస్యత అక్రమ రవాణాకు కారణమని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళల భద్రతకు, రక్షణకు ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహం నుంచి పాత పాళ్యం వరకు శాంతినడక ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా బీసీ సంఘం అధ్యక్షుడు సురేంద్రయాదవ్, ఎస్‌ఐ వెంకటేశ్వర్లు, రీడ్స్ సంస్థ చైర్మన్ థియోస్టీఫెన్, డైరెక్టర్ ఆనంద్, జిల్లా కో–ఆర్డినేటర్ కోదండపాణి, సంస్థ అధికారులు దివ్య, దీప్తి పాల్గొన్నారు.